లేడీస్ Special

బంగారు

పల్లేనికైనా గోడ చేర్పు ఉండాలి అంటారు. అలా అండగా నిలిచి.. ప్రోత్సహించే వారుంటే అతివలు అడుగిడని రంగమూ ఉండదు.. సాధించలేని విజయాలూ ఉండవు. అయితే కొందరిలో ఎవరైనా చూస్తారేమో అనే బిడియం, అందరి ముందు ప్రాక్టీస్ చేయాలంటే భయం ఉంటాయి. అవి వారి ఉన్నతికి ఆటంకంగా నిలుస్తాయి. ఆ అడ్డుగోడను తొలగిస్తూ కేవలం మహిళలకే శిక్షణ ఇచ్చేలా కొన్ని సంస్థలు ఏర్పాటయ్యాయి మురళీనగర్‌లో. మగువల్లో ఉత్సాహాన్ని, నైపుణ్యాన్ని వెలికి తీస్తూ వివిధ రంగాల్లో శిక్షణనిస్తూ ప్రోత్సహిస్తున్నాయి. ఈ సంస్థలను ఏర్పాటు చేసింది మహిళలే కావడం విశేషం.

- మురళీనగర్

వనితలకు ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలు

మహిళా భ్యుదయానికి కృషి

కుట్లు, అల్లికలు, ఈత, కోలాటం, పోటీ పరీక్షల్లో తర్ఫీదు

వాకర్స్ క్లబ్ మహిళల మొక్కవోని సంకల్పం


మహిళా భవన్‌లో సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ మహిళలు




అబ్దుల్ కలాం కళాక్షేత్రంలో మహిళా వాకర్స్ ఆత్మీయ కలయిక

అందరిలాగే మహిళలకూ ఆడాలని.. పాడాలని.. పదిమందిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆడవాళ్లకు మాత్రమే శిక్షణ ఇచ్చే సంస్థలు ఉండాలి. మహిళలు తమ సమస్యలు చర్చించడానికి, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి అందరి సహకారం, వేదిక అవసరమవుతాయి. ఉపాధి కోర్సులు నిర్వహించి మహిళల్లో ఆర్థిక ప్రగతి సాధించడానికి, ఆసక్తి గల క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహం ఉండాలి. ఈ నేపథ్యంలో మురళీనగర్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉన్నాయి. మహిళల అవసరాలను గుర్తించి వారిని ప్రోత్సహించేలా స్థానిక వాకర్స్ క్లబ్‌లు, నాయకులు సహకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో వీరు అనేక క్రీడల్లో ప్రవేశం పొందడమే కాకుండా మహిళల్లో చైతన్యం కలిగించే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వేడుక ఏదైనా వీరి కోలాటం ఉండాల్సిందే..

ఎస్.రోజారాణి ఆధ్వర్యంలో కోలాటంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని ఒక అంతస్తులో ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. రామాలయంలో, వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, స్థానికంగా జరిగే ఇతర వేడుకల్లోనూ వీరి ప్రదర్శన తప్పనిసరి.

స్విమ్మింగ్‌లో రాణించేలా..

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కుకు అనుబంధంగా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో మహిళలకు ప్రతి రోజూ సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఇద్దరు మహిళా కోచ్‌లను నియమించారు. రోజూ 20 మంది వరకు మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.


మురళీనగర్‌లో స్విమ్మింగ్ పూల్

వాకర్స్ క్లబ్



మురళీనగర్ పరిసరాల్లో మహిళా వాకర్స్ ఎక్కువగానే ఉన్నారు. వీరి కోసం వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా క్లబ్‌లు నిర్వహిస్తున్నారు. వనితా వాకర్స్ క్లబ్ నగరంలోనే మొదటి సారి మహిళల కోసం ఏర్పాటు చేసిన క్లబ్‌గా గుర్తింపు పొందింది. దీనిలో 650 మంది సభ్యులున్నారు. పి.ప్రభావతి అధ్యక్షతన మహిళలు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ భవనంలోని మొదటి అంతస్తులో మహిళా చైతన్య కార్యక్రమాలు, ఉపాధి శిక్షణ, సాంస్కృతిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సేవల్లో ముందుంటూ..

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నిత్యం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అతి తక్కువ కాలంలోనే ఉత్తమ సేవా అవార్డులను అందుకుంటోంది. కె.మాధవి అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఈ క్లబ్‌లో 185 మంది సభ్యులు ఉన్నారు. వీరు స్వచ్ఛందంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. వీరి సమావేశాల నిర్వహణకు వుడా కాలనీలోని ఈస్ట్ పార్కులో అబ్దుల్ కలాం కళావేదికను నిర్వాహకులు కేటాయించారు.

మహిళా గ్రంథాలయం

మురళీనగర్‌లో ఉన్న గ్రంథాలయం జిల్లాలోనే ప్రత్యేకమైంది. దీన్ని గ్రంథాలయ ఉద్యమ నేత, ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు గుల్లేపల్లి సింహాద్రప్పడు ప్రత్యేక కృషితో మహిళలు, పిల్లల గ్రంథాలయంగా ఏర్పాటు చేశారు. ఉమ్మడి విశాఖలో ఇదొక్కటే మహిళల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీగా గుర్తింపు పొందింది. గ్రంథాలయ ఆశయానికి అనుగుణంగా మహిళా దినోత్సవాలు, బాలల వేడుకలు మహిళా క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీరి కోసం మహిళా సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచి పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నారు. వేసవిలో ప్రత్యేకంగా మహిళల ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ గ్రంథాలయంలో 13,676 పుస్తకాలు ఉన్నాయి. వీటిలో 10,668 తెలుగు, 2051 ఇంగ్లిష్, 907 హిందీ, 43 ఉర్దూ భాషకు చెందినవి ఉన్నాయి. గ్రంథాలయం డిపాజిటర్లు 2,676 మంది ఉండగా.. వీరిలో 1,285 మంది మహిళలున్నారు. వీరి కోసం నవలలు, కథలు, కవితలు, ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ, వంటింటికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని మహిళలు చక్కగా వినియోగించుకుంటూ వారి విజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.


గ్రంథాలయంలో చిన్నారుల పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తూ..


మహిళల ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు

అన్ని రంగాల్లో రాణించాలని..



మహిళలు వంటింటికి పరిమితం కాకుండా వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో రాణించి గుర్తింపు పొందాలనేది మా ఆశయం. అందులో భాగంగా మహిళలతో ప్రత్యేకంగా వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. మురళీనగర్ పరిసరాల్లో నివసిస్తున్న మహిళలతో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ఆరోగ్య రక్షణపై చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా వేదికలు అందుబాటులోకి తెస్తున్నాం. పేద మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా కుట్టుమిషన్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, కంప్యూటర్, యోగా, మగ్గం వర్కు వంటి విభాగాల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మా ప్రయత్నం ఫలిస్తోంది. ఇప్పుడు మా ప్రాంతంలో గృహిణులతో సహా మహిళలందరూ వయసుతో నిమిత్తం లేకుండా ఉత్సాహంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

- ఉప్పలపాటి శుభ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


తహసీల్దార్ రమేష్‌కు బీపీ పరీక్షిస్తున్న వైద్యులు

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విజయా డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో బీపీ, బ్లడ్ షుగర్, దంతపరీక్షలు ఉచితంగా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరంలో ఉద్యోగులు పలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ. త్రినాథ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి


వీఆర్‌వోలకు సూచనలిస్తున్న సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: అర్బన్ ఎమ్మార్వో ఎం. రమేష్ తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించి పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. 27 జీవో ప్రకారం యూఎల్‌సీ భూమిని రెగ్యులర్ చేసుకోవడానికి, జీవో నంబర్ 30 ప్రకారం అన్ అబ్జెక్షనబుల్ రెగ్యులేషన్‌కు ఏప్రిల్ 15 తారీకులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. పెదవాల్తేరు రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద యూఎల్‌సీ ల్యాండ్ రెగ్యులేషన్ కోసం అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి అపార్టుమెంట్‌లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, వీఆర్‌వోలు తదితరలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

సీతమ్మధార: సీసాతో తలపై దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. ద్వారకా సీఐ డి.వి.రమణ తెలిపిన వివరాలివి.. ద్వారకా నగర్ ప్రాంతంలో బిర్యానీ సెంటర్ నడుపుతున్న రామకృష్ణకు, అతని వ్యాపారానికి కావలసిన చికెన్ అందిస్తున్న శ్రీనివాస్‌కు మధ్య ఈ నెల 15వ తేదీన కొట్లాట జరిగింది. ఆ సమయంలో రామకృష్ణ తలపై శ్రీనివాస్ పక్కనే ఉన్న సీసాతో బలంగా దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడి చేసినట్లు రుజువు కావడంతో శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర

మహారాణిపేట: లోక కల్యాణార్థం ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి, యాత్ర దక్షిణ భారత సమన్వయకర్త చాంద్ మాల్ అగర్వాల్ తెలిపారు. రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్ర వివరాలను వెల్లడించారు. విశాఖ నగరం నుంచి శనివారం ఈ యాత్ర మొదలవుతుందని, ఏప్రిల్ 4వ తేదీ వరకు మొదటి దశలో 12 రోజులు, ఏప్రిల్ 21 నుంచి 26వ తేదీ వరకు ఆరు రోజులు మొత్తం 18 రోజులపాటు రాష్ట్రంలో జన్ ఆశీర్వాద్ యాత్ర కొనసాగుతుందని వివరించారు. రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవనంలో ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం యాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో విశాఖలో, 25 నుంచి 28 వరకు విజయనగరం, శ్రీకాకుళంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం కాకినాడ, రాజమండ్రి, తాడేపల్లి గూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, శ్రీశైలం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, రేణిగుంట మీదుగా చెన్నై చేరుకుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, గోవా, అండమాన్ నికోబార్ దీవుల్లో మొత్తం 90 రోజుల పాటు ఆశీర్వాద్ యాత్ర కొనసాగుతుందని ఆయన వివరించారు. మొట్టమొదటి ఆది మహాలక్ష్మి, అష్టలక్ష్మి అమ్మ ఆలయాన్ని హర్యానాలోని అగ్రోహాలో నిర్మిస్తున్నట్లు చాంద్ మాల్ అగర్వాల్ తెలిపారు. ఈ ఆలయ విశిష్టతను ఈ యాత్రలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమ్మేళన్ ప్రతినిధులు సమాన్ ప్రకాష్ సరావగీ, వినీత్ లోహియా, దీపక్ కన్సారియా, సంజయ్ సుమన్, టిక్‌మనీ, బీజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతిగృహంలో ఇద్దరికి ఆశ్రయం



యువతిని షెల్టర్ హోంకు తీసుకొచ్చిన పోలీసులు



షెల్టర్ హోంలో చొప్పల రాము

సీతమ్మధార: నిరాశ్రయ వసతిగృహంలో ఇద్దరికి ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. చదవటం లేదని, తక్కువ మార్కులు వస్తున్నాయని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కి విశాఖపట్నం వచ్చిన తమిళనాడుకు చెందిన రమ్య (18)కు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఆమె ఇంటర్ చదువుతోంది. విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా ఆమెను గుర్తించి ఏయూటీడీకి అప్పగించారు.

షెల్టర్ హోంకు అభాగ్యుడు: శ్రీకాకుళం జిల్లా సారవకోటకు చెందిన చొప్పల రాము (49) తాపీ మేస్త్రి. అతనికి తాగుడు అలవాటు ఉండడంతో భార్యాపిల్లల్ని చిత్రహింసలు పెట్టేవాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని పట్టించుకోవడం మానేశారు. అతన్ని గతంలో గుర్తించి షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. తర్వాత అతను ఒక హోటల్లో పని చేస్తూ జీవించేవాడు. అటు తర్వాత అతని కాలు విరిగిపోవడంతో పనికి వెళ్లలేక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు.

భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని విశాఖ నుంచి భద్రాచలానికి ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు విశాఖ ద్వారకా బస్టేషన్ నుంచి వయా రాజమండ్రి మీదుగా భద్రాచలానికి ఏప్రిల్ 5 ఉదయం 6 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని విశాఖ నగర వాసులు వినియోగించుకొని సీతారాముల కల్యాణం, శ్రీరామనవమి వేడుకలు నేరుగా భద్రాచలంలో వీక్షించి ఆ స్వామి ఆశీస్సులు పొందగలరని కోరారు.

మధురవాడ డిపో తనిఖీ..

జిల్లా ప్రజారవాణా అధికారి బి. అప్పలనాయుడు శుక్రవారం మధురవాడ డిపోను తనిఖీ చేశారు. డిపోలో బస్సులు పెరుగుతున్న దృష్ట్యా సిబ్బంది మరింత చురుగ్గా పని చేయాలని, ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీస్ చేయాలని సూచించారు. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకుని వెళ్లాలని, అందుకు సిబ్బంది సహకారం ముఖ్యమన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని, మరిన్ని వివరాలకు 9552300009 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రాజేశ్వరి, ట్రాఫిక్ ఇంజినీర్ దుర్యోధన, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలి


సమావేశమైన గ్రంథాలయ సంస్థ పెన్షనర్లు, ఉద్యోగులు

డాబాగార్డెన్స్: గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమ చేయలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ తీర్మానాలు ఆమోదించింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకుని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు కన్వీనర్‌గా మరో 10 మందితో కమిటీ ఏర్పాటైంది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికీకరిస్తామని గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు బి. ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామభద్రరాజు, విశాఖ, విజయనగరం జిల్లాల గ్రంథాలయ సంఘాల అధ్యక్షుడు ఆనందరావు, కె. శ్రీనివాసరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తూర్పు గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక మంది గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సీతమ్మధారలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సాయిబాబా టెంపుల్, సబ్బం హరి రోడ్డు, మైత్రి టవర్, స్వాతి ప్రమోటర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


ప్రత్యేక పానీయం పంపిణీ చేస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: రంజాన్ మాసం సందర్భంగా జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్-ఈ-అల్ ఖదీర్ ప్రాంగణంలో శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జుమ్మా నమాజ్ ఆచరించారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. దాతల సహకారంతో చేసిన ప్రత్యేక పానీయాన్ని ముస్లింలకు అందజేశారు. ఉపవాస దీక్షలో ఉన్న వారికి సాయంత్రం మసీదు ప్రాంగణంలో ఇఫ్తార్ కిట్లు పంపిణీ చేశారు. మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విక్టోరియా ఆస్పత్రికి అధునాతన పరికరాలు


డాక్టర్ ఉషాప్రసాద్‌కు ఒప్పంద పత్రాలు అందిస్తున్న సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ సీఈవో నవీన్

మహారాణిపేట: విక్టోరియా ప్రభుత్వ ఆస్పత్రికి రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలను సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ సమకూర్చింది. ఈ పరికరాలను శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్‌కు కంపెనీ సీఈవో అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నవీన్ అందజేశారు. సీఎస్సార్‌లో భాగంగా ఈ పరికరాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రి డాక్టర్ జీవన్ సంతోష్ కుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాలలో అటవీ దినోత్సవం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగావకాశాలు, ప్రిపరేషన్ వంటి పలు విషయాలు తెలియజేస్తూ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, పీజీ గెస్ట్ ఫ్యాకల్టీ అంజలి, యూజీ గెస్ట్ ఫ్యాకల్టీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

బాల్యం కేంద్రాల సమస్యలపై నివేదిక


బాల్యం చిన్నారులతో మాట్లాడుతున్న గొండు సీతారాం

సీతంపేట: జీవీఎంసీ పరిధిలో ఉన్న 37 బాల్యం కేంద్రాల్లో బాలలు ఎదుర్కొంటున్న పౌష్టికాహారం, వసతి సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో గల బాల్యం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న పిల్లల సంఖ్య, అందులో బడుగు బలహీన వర్గాల వారు ఎంతమంది, ఏ ప్రాంతాల నుంచి వస్తున్నారు, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో నగరంలో 37 బాల్యం కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కరోనా నుంచి మధ్యాహ్న భోజనం నిలిచిపోయిన విషయం పిల్లలు తన దృష్టికి తెచ్చారన్నారు. యూనిఫాం, బూట్లు, టైలు దాతలు అందిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వంతో పాటు, జీవీఎంసీ అధికారులు సమకూర్చేలా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాల్యం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మోహన్‌కుమార్, సీతమ్మధార మండల ఎంఈవోలు రామారావు, బాలామణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణకుమారి, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం పద్మజారాణి, బాల్యం సూపర్‌వైజర్ జె.సూర్యనారాయణ ఉపాధ్యాయురాలు డి. చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్ ప్రయాణాలకు చెక్

సాక్షి ఎఫెక్ట్..


రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహన చోదకులకు జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం మెయిన్‌రోడ్డుపై రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలపై ద్వారకా ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.ప్రతాప్‌కుమార్ సిబ్బందితో జరిమానాలు విధించారు. 'సాక్షి' దినపత్రికలో 'గజిబిజిగా వాహనాల రాకపోకలు' శీర్షికన 19వ తేదీన ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. దీంతో శుక్రవారం రాంగ్ రూట్‌లో వచ్చే వాహన చోదకులకు జరిమానాలు విధించి అవగాహన కల్పించారు. రాంగ్ రూట్లో రావడం ప్రమాదకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. మరోవైపు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో కార్లు, ఆటోలు యథేచ్ఛగా పార్కింగ్ చేయరాదని తెలిపారు. ఆ ప్రాంతంలో రోడ్డుని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10.5 కోట్లతో రెండు వసతిగృహాల నిర్మాణం


కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: జిల్లాలో రెండు హాస్టళ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రామారావు వెల్లడించారు. రూ.10.5 కోట్లతో వీటిని నిర్మించనుందని తెలిపారు. జిల్లా పరిషత్ దరి కృష్ణనగర్‌లో కాలేజ్ గరల్స్ హాస్టల్‌ను రూ.6 కోట్లతో, భీమిలిలో కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను రూ.4.5 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులతో కూడిన మార్గదర్శకాలు అందాయన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న రెండు హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త వాటిని నిర్మించాలని 2023లో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ప్రతిపాదనలు పంపించిందన్నారు. వాటి స్థానంలో కొత్త హాస్టల్స్ నిర్మాణం త్వరలోనే ప్రారంభవుతుందన్నారు. దీంతో పాటు జిల్లాలోని 18 హాస్టల్స్‌కు ఆర్‌వో వాటర్ ప్లాంట్స్‌ను కొత్తగా మంజూరు చేసినట్లు తెలిపారు. సీఆర్ఎస్ నిధుల ద్వారా కలెక్టర్ ద్వారా అందించిన నిధులతో ఈ ప్లాంట్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే చాలా చోట్ల ప్లాంట్స్ నిర్మాణం కూడా పూర్తయిందన్నారు.

ఆ విద్యార్థులు సచివాలయాలను సంప్రదించాలి..

2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 9,002 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నిధులు మంజూరైనట్లు డీడీ రామారావు తెలిపారు. నిధులు మంజూరైన వారిలో డిగ్రీ, పీజీ విద్యార్థులతో పాటు ఇంజినీరింగ్, ఐటీఐ విద్యార్థులు తదితరులు ఉన్నారన్నారు. అయితే ఇంకా నిధులు మంజూరు కాని విద్యార్థులు జిల్లాలో 400 మంది వరకు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వీరంతా వారికి స్థానికంగా ఉన్న సచివాలయాలకు వెళ్లి అర్హత పత్రాలు సమర్పించడంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేశారు.